




నేటి నుంచి అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరులోని కేంద్రీయ విద్యాలయంలో నేటి నుంచి 2 నుంచి 9వ తరగతి వరకూ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ టి.రవీంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. 1వ తరగతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు కందుకూరు కేంద్రీయ విద్యాలయం వద్ద దరఖాస్తులు ఇస్తారన్నారు. అక్కడే తీసుకుని అప్లికేషన్ పూర్తి చేసి స్కూల్లో అందజేయాలని ప్రిన్సిపల్ రవీంద్ర కుమార్ తెలిపారు.



టి రవీంద్రకుమార్, ప్రిన్సిపల్

వైసిపిలో మరో వికెట్..!

వైసిపికి దెబ్బమీద దెబ్బ తగులు తోంది.. ఇప్పటికే పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని ముగ్గురు ఎంఎల్‌ఎలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీని నుంచి ఎలా బయటపడాలనే విషయంపై మల్లగుల్లాలు పడుతోన్న ఆపార్టీకి మరో షాక్ తగిలింది. ఇటీవల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేసిన వైసిపి అభ్యర్థి, సజ్జల రామకృష్ణారెడ్డికి అంత్యంత సన్నిహితుడు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల తన ఓటమికి జిల్లాలోని మంత్రి, ఎంఎల్‌ఎలు కారణమని ఆవేదనతో ఉన్న ఆయన టిడిపి వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇది తొలుత ప్రచారం మాత్రమేనని తొసి పుచ్చారు. అంత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం యువగళం పాదయాత్రలో రహస్యంగా లోకేష్‌ను కలిసినట్లు తెలిసింది. ఇప్పుడు ఒక్కసారిగా వైసిపిలో మరో పెను తుఫాన్ రేగింది.

○లోకేష్‌ను కలిసిన వైసిపి నేత 'పేర్నాటి'

○టిడిపిలో చేరేందుకు సన్నాహాలు

○ఇప్పటికే ముగ్గురు ఎంఎల్‌ఎలు సస్పెన్షన్



పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైసిపి నేత

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

వైసిపిని సమస్యలు వీడడం లేదు. గత ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన ఆపార్టీ ఇప్పుడు ఇబ్బందులు పడుతోంది. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రాదని గ్రహించిన నేతలు ఒక్కొక్కరు పార్టీని వీడుతున్నారు. తొలుత నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి పార్టీ తిరుగుబావుటా ఎగురవేశారు. పార్టీలో చేరుతారని ప్రచారం సాగుతున్న క్రమంలో ఇటీవల జరిగిన ఎంఎల్‌ఎ కోటా ఎంఎల్‌సి ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారనే అనుమానంతో ముగ్గురు ఎంఎల్‌ఎలను ఒకేసారి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఇది పెను సంచలనం కలిగించింది. ఒకే పార్టీ, ఒకే జిల్లాలో ముగ్గురు ఎంఎల్‌ఎలను సస్పెండ్ చేయడం రికార్డు. ఇప్పుడు ముగ్గురు ఎంఎల్‌ఎలు వైసిపికి, జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. జిల్లా వైసిపిలో అయోమయం నెలకొంది. వచ్చే ఎన్నికలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయా అనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. రాష్ట్ర రాజకీయాలను జిల్లా రాజకీయాలు ప్రభావితం చేస్తున్నాయి..

లోకేష్‌తో పేర్నాటి భేటీ..?

వైసిపి ముఖ్యనేతలో ఒకరు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితులు, ఇటీవల జరిగిన తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తాజాగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసినట్లు విశ్వసనీయ సమాచారం. యువగళం పాద యాత్రలో ఆనంతపురంలో ఉన్న ఆయనను టిడిపిలోని కొందరు నేతలతో కలిసి రహస్యంగా కలిసినట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం నుంచి ప్రచారం జరుగుతుండగా, ఆయన అనుచరులు ఖండించారు. ఆయన కలిసింది వాస్తవమేనని టిడిపిలోని అత్యంత విశ్వసనీయ సమాచారం. వైసిపి ఏర్పాటు నుంచి ఆయన పార్టీలో ఉన్నారు. కోట ప్రాంతానికి చెందిన ఆయన సిలికా వ్యాపారంలో ఉన్నారు. 2014 ఎన్నికల సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ మద్యం సరఫరా చేసిన కేసులో ఉన్నారు. సజ్జలకు అంత్యంత సన్నిహితులు కావడంతో తమ భార్యకు రాష్ట్ర విత్తన సరఫరా సంస్థ ఛైర్మన్ పదవి ఇచ్చారు. తాజాగా ఆయనకు ఎంఎల్‌సి టికెట్ ఇచ్చారు. ఇదే సమయంలో జిల్లాలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు ఎవరూ తన విజయానికి కృషిచేయలేదని, తనను ఓడించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. పోలింగ్ కౌంటింగ్ హాలు నుంచి ఆవేశంగా వెళ్లిపోయినా ఆయన ఎక్కడా కనిపించలేదు. ఫోన్‌లో కూడా ఎవరితో మాట్లాడినట్లు కనిపించలేదు. శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ఎక్కడున్నాననడే సమయంలోనే తాజాగా ఆయన లోకేష్‌ను కలిసినట్లు సమాచారం. కొందరి నేతల ఓటమే ధ్యేయంగా పనిచేయాలనే ఉద్దేశ్యంతో టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వైసిపి పెద్దలు ఈ విష యంపై ఆరా తీస్తున్నారు. టిడిపి నేతలు మాత్రం ఎవరు వచ్చినా.. వెళ్లినా మా పరిధిలో ఏం లేదని, అంతా అధిష్టానం చూసుకుంటుందని చెబుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి..

నేటి నుంచి 'పది' పరీక్షలు..!

○ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు

○29,401 మంది విద్యార్థులు హాజరు



ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఈనెల 18 తేదీ వరకు పరీక్షలు నిర్వహించడానికి విద్యా శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగను న్నాయి. మొత్తం విద్యార్థులు 29,401 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 15,127 మంది బాలురు, 14372 మంది బాలికలు ఉన్నారు. ఇందులో 27,291 మంది వెగ్యులర్, 2110 మంది ఒక్కసారి ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు డిఇఒ ఆర్‌ఎస్ గంగాభవాని తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 27,256 మందిలో బాలురు 13,669 మంది, బాలికలు 13,587 మంది ఉన్నారు. ప్రయివేటుగా 2243 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండా బాలురు 1458 మంది, బాలికలు 785 మంది ఉన్నారు. సెట్,-1, సెట్-2 పేర్లు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. వేసవి కాలం కావడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచి నీటి వసతి ఏర్పాట్లు చేశారు. బెంచ్‌లు సర్దుబాటుచేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి రావాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అధికారులు చెబుతున్నారు. 172 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఏ సెంటర్లు 91, బి సెంటర్లు 56, సి సెంటర్లు 25 గా అధికారులు గుర్తించారు. 14 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. 7 కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. 48 పరీక్ష పత్రాల కేంద్రాలను ఏర్పాటు చేశావరు. తొమ్మిది ఫ్లయింగ్ బృందాలను స్కాడ్ ఏర్పాటు చేశారు. ఇందులో ఎసిజిఇ, డిప్యూటి ఇఒ, ఎంఇఒ, సీనియర్ ప్రిన్సిపల్, తోపాట పలువురు అధికారులు బృందంలో ఉంటారు. 'పది' పరీక్షలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వేసవి తాకిడి తట్టుకునేలా పాఠశాలలో ఫ్యాన్లు, మంచినీరు వంటి సదుయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు..

బూడిద లారీల రాకపోకలను నిషేధించాలి

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల ప్రాణాలు హరిస్తున్న యాష్ పౌడర్ బూడిద లారీలు నగరంలోకి రాకుండా పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కమిటీ కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నగరంలో యాష్ పౌడర్ లారీలు ప్రయాణం చేస్తున్నాయన్నారు. ఈ లారీలు అతి వేగంగా ప్రయాణం చేయడం వల్ల పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. మరి కొంత మంది అవయవాలను కోల్పోయి వేదనతో జీవితం సాగిస్తున్నారన్నారు. థర్మల్ ప్లాంట్ నుంచి విడుదలైన బూడిదను లారీలల్లో నింపుకొని సిమెంట్ పరిశ్రమలున్న జిల్లాలకు తరలిస్తు న్నారన్నారు. ఈ ప్రాంతంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబ సభ్యులను కోల్పోయి వారి జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ఈ ప్రమాదాన్ని జిల్లా యంత్రాంగం గుర్తించి యాష్ పౌడర్‌ను తరలిస్తున్న లారీలకు నగరంలోకి ప్రవేశం లేకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి నిర్ణయం తీసుకోని పక్షంలో సిపిఎం ఆందోళన తీవ్రతరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 16వ డివిజన్ సెక్రెటరీ కాయం శ్రీనివాసులు, సిపిఎం నాయకులు పిట్ల సూర్యనారాయణ ,అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి , గజ్జ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి -కందుకూరు :డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1 నుంచి 14 వరకు జరగనున్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఓగూరు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపూరి మనోహర్, జి ఏడుకొండలు, వై వెంకట రావు, ఎం మధు బాబు, జి శ్రీను, కె తిరుపతి, డిబి కోటేశ్వరరావు అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళు లార్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ అధ్యక్షులు ముప్పవరపు కిషోర్, బుద్ధ -అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు గాండ్ల. హరిప్రసాద్, బందావనం యువత జె రవి కుమార్, గేరా నరేష్, డి. శరత్, సిహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం కొనసాగింపులో భాగంగా ఈ నెల 03న కందుకూరు ఎర్రగుంట పాలెం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు నిర్వహించనున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

బాబు సభను జయప్రదం చేయాలి

సభాస్థలిని పరిశీలించిన టిడిపి నేతలు



సమావేశ స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఈనెల 7న నగరంలో జరిగే పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సభను విజయ వంతం చేయాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులుసోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశం అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగింది. ఎంఎల్‌సి ఎన్నికల విజయం తర్వాత నెల్లూరు నగరంలో ఐదు పార్ల మెంట్ స్థానాలు, 35 అంసెబ్లీ నియోజకవర్గాల నేతలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఒక్కో నియోజ కవర్గం నుంచి 60 మంది ముఖ్యనేతలు హాజరు కానున్నారు. స్థానిక వేణుగోపాల్ స్వామి కాలేజ్ ప్రాంగణంలో జరిగే ఈ సమావేశ నిర్వాహణకు కమిటీ వేశారు. అనంతరం నేతలంతా సభాస్థలిని పరిశీలించారు. వేదిక, నాయకులు, కార్యకర్లలు, పార్కింగ్ అనేక విషయాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు , ఒంగోలు పార్లమెంట్ల కో ఆర్డినేటర్ బిసి జనార్ధన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, గూడూరు, సూళ్లూరుపేట, కావలి నెల్లూరు నగరం, కందుకూరు నియోజ కవర్గాల ఇన్చార్జిలు పాసిం సునీల్ కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం, మాలేపాటి సుబ్బా నాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు , మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మీ నాయుడు, కంభం విజయరామిరెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ జెడ్ శివప్రసాద్, నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, గూడూరు నియోజ కవర్గాల పరిశీలకులు బొమ్మి సురేంద్ర, బుల్లెట్ రమణ బొమ్మన శ్రీధర్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, దివి శివరాం, కన్నబాబు లు, మాజీ రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ,మాజీ ఆప్కాఫ్ ఛైర్మన్ కొండూరు పాలిసెట్టి, శాసనమండలి ఎన్నికలకు పోటీ చేసిన అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంచల్ బాబు యాదవ్,రాష్ట్ర కార్యదర్శులు జెన్నీ రమణయ్య, దావా పెంచలరావు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి -పొదలకూరు

మండలంలోని తోకంచి గ్రామంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు రాష్ట్రానికి 'ఇదేమి ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. మల్లికార్జున్ నాయుడు, నాయకులు బక్కయ్య నాయుడు నారప నాయుడు మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా.. ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు వైసిపికి బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉందన్నారు. టిడిపి పొదలకూరు పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, మండల కోశాధికారి కరియావుల శ్రీనివాసులు నాయుడు, దేవినేని సుబ్బా నాయుడు, కరియావుల నారపనాయుడు, నర్రా. రవీంద్ర, శ్రీనివాసులు నాయుడు, మామిళ్లపల్లె. నవీన్, ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పంతగిరి సురేష్, నవీన్, జువ్వల. పెంచలయ్య, దేగా హరినారాయణ ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ : సోమిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో భూఆక్రమణలు, అక్రమ లేఅవుట్లు, ఇసుక, సిలికా దోపిడీ తదితర అరాచకాలకు అడ్డు అదుపూ లేకుండా పోయిందని మాజీ మంత్రి , టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లీపురంలో తన ఇంటి ఎదురుగా పంట కాలువలు, కాలువ పొరంబోకులను ఆక్రమించి అనుమతులు లేకుండా లేఅవుట్ వేస్తుంటే ప్రజల సొత్తును కోట్లాది రూపాయలు జీతాలుగా తీసుకుంటున్న అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తొలుత చంద్రబాబు ఈనెల 7న జోనల్ సమావేశం నిర్వహిం చనున్న నేపథ్యంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. విలేకర్ల సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ ఇంటూరి నాగేశ్వరరావు, గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మీ నాయుడు, చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామీ రెడ్డి, తాళ్లపాక అనురాధ, కొండూరు పాలిసెట్టి, చంచల్ బాబు యాదవ్, కన్నబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి



గ్రాడ్యుయేషన్ డే సంబరాలలో పాల్గొన్న విద్యార్థులు

'ఆక్స్‌ఫర్డ్'లో సంబరాలు

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న బి.ఆర్ ఆక్సఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్లో ప్రీ ప్రైమరీ, యూకేజీ ప్రైమరీ విభాగంలోని ఐదో తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సంబరాలు శనివారం కన్నుల పండుగగా జరిగాయి.విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అక్కడికి వచ్చిన వారి తల్లిదండ్రులను ఆనందమయం చేశారు. బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలలో నైతిక విలువలు తగ్గిపోయి చెడు ప్రయోగాలు చేస్తున్నారన్నారు. వారికి చిన్న తరగతుల నుంచే విలువలతో కూడిన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు దోహదపడాలని కోరారు. బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ బాల భాస్కర రావు, నరేంద్ర బాబు ప్రిన్సిపాల్స్ రామారావు, మల్లికార్జున, ప్రైమరీ ఇన్చార్జి సునీత, ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'రెడ్‌క్రాస్' ఎన్నికలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు :సాధారణ ఎన్నికలు జరిగే విధంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాలక వర్గం జిల్లా కమిటీ ఎన్నిక కొనసాగింది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండను సైతం లెక్కచేయకుండా ఓటింగ్ ప్రక్రియలో ఓటర్లు పాల్గొన్నారు. నెల్లూరు, కావలి ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ఓటింగ్ ప్రక్రియలో 7138 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాల్సి 4001 సభ్యులు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు అందజేసిన వివరాల మేరకు 56 శాతం ఓటింగ్ పోలైంది. గతంలో ఎప్పుడు లేని విధంగాపోటీ చేస్తున్న అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద వస్తున్న ఓటర్ల వద్దకు వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించడం కనిపించింది. నిజానికి సేవ చేయాలన్న కోరిక ఉన్న వారికి పాలక వర్గంలో పదవులు అవసరమా అని పలువురు సభ్యులు గుసగుసలాడుకోవడం కనిపించింది. ఓటింగ్ జరుగుతున్న వరకు ముత్తుకూరు బస్టాండ్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పెట్టుకొన్న ప్రధాన వర్గానికి చెందిన సభ్యులు మర్రిపాడు, ఆత్మకూరు తదితర ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేసి ఓటర్లను ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేశారు. రెడ్‌క్రాస్ జీవిత కాలం సభ్యత్వం కలిగిన కొంత మంది పేర్లను ఓటర్ జాబితాలో కనిపించక పోవడంతో నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం ఆవరణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఈ దశలో రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్ర వద్ద ఉద్రిక్తత నెలకొంది. జీవిత కాలం సభ్యత్వం తీసుకున్న తమ ఓటు తొలగించడం ఎంత వరకు న్యాయమని, తాము ఓటు వేసేందుకు అనుమతులు ఇవ్వాలని, లేకపోతే ఓటింగ్ ప్రక్రియ నిలిపివేయాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా ప్రస్తుతం ఎన్నిక జరుగుతుంది కాబట్టి తాము ఏమీ చేయలేమని, ఓటు హక్కు కోసం ఎన్‌రోల్ చేసుకోవాలని సమాదానం ఇవ్వడంతో జీవిత కాల సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఓటింగ్ ప్రకియలో పాల్గొని తన ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. చిన్న , చిన్న వాదులాటల మధ్య రెడ్‌క్రాస్ సొసైటీ పాలక వర్గం జిల్లా కమిటీకి సంబంధించిన ఎన్నిక పూర్తి కాగా సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభించి సా యంత్రానికి ఎవరెవరూ సభ్యులు ఎన్నికైంది, పూర్తి స్థాయిలో పాలక వర్గం ప్రకటిం చనున్నారు.

ఘనంగా 'మట్టల' వేడుకలు

ప్రజాశక్తి -కందుకూరు

మట్టల ఆదివారం సందర్భంగా కందుకూరు జెడిబియం టౌన్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో యేసు జయోత్సవ ప్రవేశం గూర్చి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ గడ్డం జాన్ మాట్లాడుతూ సందేశమిచ్చారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు చదలవాడ కొండయ్య, జంగాల ప్రభు కుమార్, మద్దాలి రమేష్, కొండేటి కరుణాకర్, తలారి కోటేశ్వరరావు ఉన్నారు.

తోటపల్లిగూడూరు :మండలంలోని క్రైస్తవ మందిరాలలో మట్టల ఆదివారం (పామ్ సండే) వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇస్కపాలెం సెంటర్లోని క్రైస్తవ ఆరాధన మందిరం యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మట్టల ఆదివా రం వేడుకలు అత్యంత ఘనం గా జరిగాయి. సండే స్కూల్ చి న్నారులు మట్టలు చేత పట్టు కొని వీధుల్లో ప్రదర్శన నిర్వ హించారు. ఫెలోషిప్ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ ఛైర్మన్, పాస్టర్ కుందవరం బాబి ఇ మ్మానుయేల్ ప్రార్థనలు చేశారు.



కందుకూరులో..

'పది' పరీక్షలను సజావుగా నిర్వహించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నెల్లూరు :పది తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, పేపర్ లీకేజీ, పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. నేటి నుంచి జరుగుతున్న పది తరగతి పబ్లిక్ పరీక్షలో విద్యార్థిని ,విద్యార్థులకు మెరుగైన వసతులను సౌకర్యాలను జిల్లా అధికార యంత్రాంగం కల్పించాలని కోరింది. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు మెండా. శ్రీహర్ష మాట్లాడుతూ గతంలో జరిగిన పేపర్ లీకేజీ వంటి పరిస్థితులు ఈసారి పునరావత్వం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో నారాయణ విద్యాసంస్థల్లో పేపర్ లీకేజ్ జరిగిన ఘటనలున్నాయని, దీనివల్ల అనేక మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో నారాయణ, శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థల్లో సెట్టింగ్ స్క్వాడ్ ,ఫ్లేయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య ఆత్మక కేంద్రాలుగా గుర్తించిన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల పరీక్షా కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తలుగా దాహార్తి తీర్చేందుకు నీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రాథమిక చికిత్సలు అందజేసేందుకు వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. పది పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌టిసి అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

ప్రజాశక్తి -కందుకూరు :నేటి నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలో విద్యార్థులు మెరుగైన వసతులను సౌకర్యాలను కల్పించాలని, ఎస్‌ఎఫ్‌ఐ కందు కూరు మండల కమిటీ ఆకాంక్షించింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మెండా. శ్రీహర్ష మాట్లాడుతూ గతంలో జరిగిన పేపర్ లీకేజీ వంటి పరిస్థితులు ఈసారి పునరావత్వం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నారాయణ విద్యాసంస్థల్లో పేపర్ లీకేజ్ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థల్లో సిట్టింగ్ స్క్వాడ్ ,ఫ్లేయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, సమస్య ఆత్మక కేంద్రాలుగా గుర్తించిన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

బాలికల వసతి గృహంలో పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు : స్థానిక బిసి బాలికల వసతి గృహాన్ని ఆదివారం జిల్లా బిసి సహాయక అధికారిని ప్రసూన సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో మెనుపై ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ఉన్నందున, అందుచేత పిల్లలకు ఆహార భద్రతలు దేనికి టెన్షన్ పడకుండా చదువుకుంటూ సమయానికి నిద్రపోయి ఉదయాన్నే లేచి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఆమెవెంట యల్లాయపాలెం వార్డెన్ అశోక్, కోవూరు వార్డెన్ నాగభూషణమ్మ ఉన్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం కచ్చేరిమిట్ట నివాసులు అళహరి రామక్రిష్ణ, వారి తండ్రి అళహరి.రామయ్య జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా కావలి పట్టణం తుపాను నగర్లోని పేదలకు 50 ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలకు పేదలకు ఆకలి తీర్చిన దాత అళహరి.రామక్రిష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు.

వాత్సల్య పథకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి : మిషన్ వాత్సల్య పథకానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఉదయగిరి శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిని పచ్చవ.లావణ్య పేర్కొన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ జిల్లా పిడి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలతో వారి సర్వేలో ఉన్న 18 సంవత్సరాలు లోపు ఉన్న అనాథలు, పాక్షిక అనాథలు, తలిదండ్రులు దూరమైన పిల్లలు, కుటుంబం వదిలేసిన తలిదండ్రులు ప్రాణాంతక వ్యాధితో బాధపడే వారి పిల్లలు, తలిదండ్రులు విడాకులు తీసుకున్న బాలకార్మికులు, బాల్య వివాహాలు చేసుకుని చదువుతున్న పిల్లలు, అక్రమరవాణాకు గురైన వారి పిల్లలు, దివ్యాంగుల బాధిత పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన పిల్లలు, పారిపోయిన పిల్లలు, యాచక వితంతువుల పిల్లలను గుర్తించాలన్నారు. అలాగే వారి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 72000 పట్టణ ప్రాంతాలలో 96000 మించకుండా ఉన్న అర్హత కలిగిన వారినుండి మహిళా సంరక్షణ కార్యదర్శితో కలిసి సర్వే నిర్వహించి దరఖాస్తులను ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులను అన్ని అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి 15 లోపు కార్యాలయంకు అందజేయాలన్నారు.

మేకపాటిని కలిసిన ఎంఎల్‌సి మేరిగ



ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సిగా ఏకగ్రీవంగా నిలిచిన మేరిగ మురళీధర్ ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నామినేషన్ సమయంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పెద్దలందరూ తనకు తోడుగా నిలిచారని, తాను ఏకగ్రీవంగా విజయం సాధించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో అందరి సహాయ సహకారాలతో ప్రజలకు సేవ చేయాలని ఎంఎల్‌ఎ అన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : 3వ తేదీ సోమవారం నుండి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఇందుకోసం పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆత్మకూరు ఎంఇఓ షేక్ నజీర్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 830 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి 537 మంది ప్రయివేట్ పాఠశాలల నుంచి 293 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సైన్స్ పరీక్ష ఒకే ప్రశ్నపత్రం ఉంటుందని ఒఎంఆర్ ఆన్సర్ షీట్ విడివిడిగా ఇస్తారన్నారు. నాచురల్ సైన్స్, భౌతిక శాస్త్రం ప్రశ్నలకు సమాధానాలు విడివిడిగా రాయాల్సి ఉంటుందని ఒకదానిలో ఒకటి కలిపి రాయకూడదని విద్యార్థులు ఈ విషయం గమనించాలని వివరించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : సోమవారం జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్ వలీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 4 సెంటర్లలో 607 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వరికుంటపాడు మండలం రెండు ఉన్నత పాఠశాలల నుండి 50 మంది విద్యార్థులు ఈ పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఎగ్జామినేషన్లు జరుగుతాయని ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరుగుతాయని 18 తేదీ పరీక్షలు పూర్తి అవుతాయన్నారు. ప్రతి విద్యార్థి కేంద్రానికి గంట ముందు వచ్చి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను విశ్వనాథరావుపేటలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాల, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులు 475 మంది ప్రయివేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని మండల విద్యాశాఖ అధికారి జయంత్ బాబు తెలిపారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : 10వ తరగతి పరీక్షలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆదివారం మండల విద్యాశాఖ అధికారి షేక్ సాహుద్దీన్ తెలిపారు. మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి జడదేవి, వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, కాకొల్లు వారి పల్లి, తూర్పు రొట్టిరెడ్డి, పాఠశాలల నుండి మొత్తం 165 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉందని తెలిపారు.

ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని 11వ వార్డు అంబేద్కర్ నగర్లోని పోలేరమ్మ పోతురాజు ఆలయ విగ్రహ పున ప్రతిష్ఠ కార్యక్రమానికి కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదివారం హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి కావలి నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ముఖ్య నాయకులు ఏగూరు చంద్రశేఖర్, ఇనగంటి అనిల్ కుమార్, బొట్లగుంట శ్రీహరి నాయుడు, కోట రమేష్, పొట్లూరు శ్రీనివాసులు, కటకం రామ, అక్కిలగుంట సూర్యప్రకాష్, దార శివకుమార్, పూడిపర్తి మురళి, దాసరి మహేంద్ర, బొక్కి పరశురాం, ఓరుగంటి యానాది, బంధమూడి రమణయ్య, బంధమూడి శ్రీనివాసులు, జలదంకి శ్రీనయ్య మోదెగుంట శ్రీనివాసులు, కొప్పూరు వెంకట నారాయణ, ఇనగంటి మాలకొండయ్య, బత్తల నాగేశ్వరరావు, కందుర్తి వెంకట నారాయణ చిలకపాటి కళ్యాణ్, వల్ల మహేష్, సురేంద్ర, గోను రవి యాదవ్, బోల్ల వేణు తదితరులున్నారు.

సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయితీలో ఉన్న సాయిబాబా మందిరం 41వ వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంజి, వెంకటేశ్వర్లు, భక్తులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల వేడుకలు

ప్రజాశక్తి-కావలి : స్థానిక శాంతినగర్‌లోని "పరిశ పోగు రాజు అండ్ రోజమ్మ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ఉదయం సండే స్కూల్‌కు చెందిన పిల్లలచే చర్చి నుండి పట్టణ ఉత్తరభాగంలోని భాష్యం స్కూల్ వరకు, అక్కడినుండి తిరిగి చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో గాయకుల "మట్టల ఆదివారం ప్రజను ఆలపించారు. అనంతరం పాస్టర్ జాన్సన్ పిల్లలకు "మట్టల ఆదివార ప్రాశస్త్యం" గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్వాసులు,సండే స్కూల్ పిల్లలు, క్రైస్తవులకు జాన్సన్ పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-సంగంలోని గౌతమ్‌నగర్ బ్రాడేజ్ వద్ద ఉన్న ప్రార్థన మందిరంలో ఆదివారం మట్టల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈతమట్టలు చేత పట్టుకుని హోసన్న జయం అంటూ తిరిగారు. కార్యక్రమంలో సంఘవిశ్వాసులు పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో క్రైస్త సోదరులు మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోలీ ఫ్యామిలీ చర్చి సంఘస్థులు మట్ట ఆదివారం సందర్భంగా బంగారుపాలెం అంతోని పేట నుండి హోలీ ఫ్యామిలీ చర్చి వరకు క్రీస్తు విజయ గీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో మట్టల ఆదివార విశిష్టతను పాస్టర్ బెల్లంకొండ పాల్ వివరించారు.

పక్కాగా 'పది' పరీక్షల నిర్వహణ

జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్ఎస్ గంగాభవాని



ప్రజాశక్తి-నెల్లూరు

నేటి (సోమవారం) నుంచి జరిగే 10వ తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్ఎస్ గంగాభవాని తెలియజేశారు. విద్యార్థి జీవితంలో పది పరీక్షలు ఎంతో కీలక భూమికను పోషిస్తాయి. ఈ ఫలితాలు ఎంతోమంది విద్యార్థుల జీవితాన్ని అనూహ్యమైన మలుపులు తిప్పుతుంది. గతంలో పది పరీక్షలు ఒక్కొక్క సబ్జెక్టుకు రెండు పేపర్లు చొప్పున మొత్తంగా 11 పరీక్షలు నిర్వహించే వారు. అయితే కరోనా తరువాత చోటు చేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది పది పరీక్షలు ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్క పేపరు చొప్పున 6 పేపర్లు మాత్రమే ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పది పరీక్షల నిర్వహణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నారో ఆమె మాటల్లోనే...

ప్రశ్న.. ఈ విద్యా సంవత్సరం పది పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరు కానున్నారు.. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంత మంది, ప్రయివేట్ పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు..?

జవాబు. ఈ ఏడాది పది పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. జిల్లా మొత్తంగా 172 పరీక్షా కేంద్రాలను పక్కాగా సిద్ధం చేశాం. ఈ ఏడాది 29,401 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 27,291 మంది, ప్రయివేట్ విద్యార్థులు 2,110 మంది హాజరు కానున్నారు. జిల్లాలో గతంలో చోటు చేసుకున్న పరిణామాలను పరిగణలోకి తీసుకొని సమస్యాత్మక పరీక్షా కేంద్రాలుగా 14 పాఠశాలలను గుర్తించాం. పరీక్షల్లో ఇన్‌విజిలేటర్లుగా 1,850 మంది అధ్యాపకుల సేవలను వినియోగించు కుంటున్నాం. ఈ పరీక్షల్లో ఎటువంటి అవకతవకలకు చోటివ్వకుండా పక్కాగా నిర్వహించేందుకు, పర్యవేక్షణ చేసేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, పరీక్షా కేంద్రాల అధికారులుగా 172, ముఖ్య పర్యవేక్షకులుగా 172 మందిని ప్రత్యేకంగా నియామకం చేశాం.

ప్రశ్న.. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి చర్యలు తీసుకున్నారు.. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

ఇంటర్వ్యూ

జవాబు. 10వ తరగతి పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు, ఆర్‌టిసి అధికారుల సహకారంతో ఆర్‌టిసి బస్సులల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఈ ఉచితం పది పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ ఆర్‌టిసి కండెక్టర్‌కు చూపించి సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సమస్య ఏర్పడితే 8341408109 నెంబరును సంప్రదించాలి. పరీక్షా కేంద్రం వద్ద ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీసు అధికారుల సహకారంతో 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. సమస్యాత్మక, అతిసమస్యాత్మక కేంద్రాలల్లో పరిస్థితులను అనుక్షణం పరిశీలించేందుకు సిసి కెమోరా లను ఏర్పాటు చేసి పర్యవేక్షించేందుకు అధికారులను నియమించాం. పరీక్షా కేంద్రాల వద్దకు పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులు పరీక్షా సమయం కంటే గంట ముందుగా హాజరుకావాల్సి ఉంటుంది.

ప్రశ్న. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది, ఇంటర్ పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని కేంద్రాలను సిద్ధం చేశారు..?

జవాబు. సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పది, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ఏప్రిల్ 17 వరకు జరుగుతాయి. పది పరీక్షలు నిర్వహించేందుకు 6 కేంద్రాలను, ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు 16 కేంద్రాలను సిద్ధం చేశాం. పది పరీక్షలకు 1,208 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు 3,090 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

జెవివి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం షిరిడి సాయిరాం కళాశాల ఆవరణంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి (రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల) వారి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకు ఒకసారి షుగర్, బిపి ఉచిత వైద్య శిబిరం రూ.200లకే రెండు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేస్తామన్నారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అతి తక్కువ ఖర్చుతో వైద్యం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ వైద్య శిబిరం చేపడతామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆత్మకూరు పరిసర ప్రాంత ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కామయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎన్ రాజు, జివివి అధ్యక్షుడు వంటేరు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి మురళికృష్ణ, హరికృష్ణ, ఎల్‌కె ప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజ్, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎంవి రమణయ్య

ఆదర్శప్రాయుడు భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి-కావలి

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కర్నూల్ ఆర్ఎంగా పనిచేసి రిటైర్ అయిన ఎస్.భాస్కర్‌రెడ్డి ఉద్యోగులకు ఆదర్శప్రాయుడని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. కావలికి చెందిన భాస్కర్ రెడ్డి పినాకిని బ్యాంకులో ఉద్యోగిగా చేరి, అంచలంచెలుగా ఎదిగి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కర్నూల్ జిల్లా ఆర్ఎంగా పనిచేసి ఖాతాదారులకు ఎనలేని సేవలు అందించి ఎపిజి బ్యాంకుకి వన్నెతెచ్చినారని తెలిపారు. భాస్కర్ రెడ్డి రిటైర్ అయిన వెంటనే కావలి వారి నివాసానికి వచ్చిన సందర్భంగా మాలకొండారెడ్డి కలిసి బ్యాంకు సేవలను రైతులకు ఖాతాదారులకు మూడు దశాబ్దాలుగా సేవలు చేసి ఎక్కడ అవినీతికి తావు లేకుండా స్వచ్ఛమైన సేవలందించి బ్యాంకింగ్ వ్యవస్థకు గౌరవం తెచ్చిన భాస్కర్ రెడ్డిని యువ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకుని ఖాతాదారులకు ప్రజలకు ఎనలేని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ దేవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలకొండారెడ్డి



ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

15 రోజుల్లో సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ పరిధిలోని గొల్లకందుకూరు గ్రామంలోని పట్టాలకు నోచుకోని శివాయి భూములకు 15 రోజుల్లో ఆర్‌డిఒ తహశీల్దారులతో సమావేశమై పరిష్కార మార్గం చూపుతామని నెల్లూరు ఎంపి, రూరల్ వైసిపి ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీనిచ్చారు. ఆదివారం గొల్లకందుకూరు గ్రామస్తులు నెల్లూరులోని ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆఫీసుకు వెళ్ళి వినతిపత్రం అందజేశారు. కరెంటు సమస్యకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని ఎంపి ఆదాలకు వివరించారు. జామాయిల్ చెట్లలో ప్రస్తుతం కరెంటు లైన్ వెళుతుందని తద్వారా కరెంటు రావడం సమస్యగా మారుతుందని వివరించారు. అక్కడ నుంచి విద్యుత్ లైను మారిస్తే సమస్యకు పరిష్కారం ఉంటుందని ప్రజలు ఎంపి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్ ద్వారా సంభాషించి, వెంటనే అక్కడినుండి విద్యుత్ లైన్ మార్చి ప్రజలకు కరెంటు కష్టాలు తీరేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా గొల్లకందుకూరు గ్రామంలో కల్వర్టు, రోడ్లు, డ్రెయినేజీ పనులకు వెంటనే అంచనాలు తయారుచేసి పనులు మొదలుపెట్టి పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి అధికారులకు సూచించారు. తక్షణమే గ్రామంలో పూర్తి చేయడానికి వీలుండే పనులను ఏమాత్రం ఆలస్యం జరగకుండా పూర్తి చేస్తామని ప్రజలకు హామీనిచ్చారు. అభివృద్ధి విషయంలో వెనకంధు వేసే ప్రసక్తే లేదని, గ్రామాలకు ఏయే అభివృద్ధి పనులు కావాలో..? అంచనాలతో జాబితా తయారు చేయాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామస్తులు నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో సమావేశమయ్యారు. ఎంపిటిసి సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు తాటిపర్తి వెంకటేశ్వర్లు, గోపాలయ్య, బాబురావు, మహేంద్ర, రాజేష్, అయ్యప్ప, వెంకటసుబ్బయ్య, బి.వేమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు కార్యదర్శి బి.బాలాజీ డిమాండ్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సోమవారం నుంచి జరుగుతున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బంధీగా నిర్వహించి, విద్యార్థులకు మెరుగైన వసతులను సౌకర్యాలను కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి బి.బాలాజీ మాట్లాడుతూ గతంలో జరిగిన పేపర్ లీకేజీ వంటి పరిస్థితులు ఈసారి పునరావృతం కాకూడదని తెలియజేశారు. సమస్య ఆత్మక కేంద్రాలగా గుర్తించిన సెంటర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులకు ఎగ్జామ్స్ సెంటర్లో వద్ద వారికి అవసరమైన సదుపాయాలతో టెన్త్ క్లాస్ బోర్డు వారు టెన్త్ క్లాస్ పరీక్షలు జరిపించాలన్నారు. ప్రస్తుతం అధికంగా ఉన్న ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకొని పరీక్ష రాసే విద్యార్థులకు తాగునీరు, క్లాస్ రూమ్‌లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. బస్సు సౌకర్యం ఆర్‌టిసి వారు విద్యార్థులకు అనుగుణంగా సమయానికి చేరుకోవాలని కోరారు.

'చలోఢిల్లీ'కి మద్దతుగా ప్రదర్శన

ప్రజాశక్తి-మర్రిపాడు

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ 5వ తేదీన జరుగనున్న చలోఢిల్లీ కార్మిక కర్షక పోరాటాలకు మద్దతునిస్తూ ప్రజా సంఘాల నాయకులు సిపిఎం కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ విధానాల వల్ల రైతాంగం ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదని అందుకే మహాధర్నా చేపట్టామన్నారు. రైతు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు నిర్ణయించాలని, నిర్ణయించిన కనీస మద్దతు ధర రైతుకు అందే లా చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2020 కేంద్ర విద్యుత్ సవరణ చట్టం రద్దు చేసి, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాల న్నారు. రుణ భారంతో కుంగిపోతున్న రైతులను ఆదుకోవడానికి రుణ విమోచన చట్టాన్ని తీసుకురావాలని, భూ యజమానితో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి వ్యవసాయంకు రుణాలు ఇవ్వాలని, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. ప్రతి వస్తువుకి ధరను నిర్ణయించారు కానీ, రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలియజేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు పద్ధతిపై ఇచ్చే ఉద్యోగాలు నిలుపుదల చేసి పర్మిట్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, ఐద్వా మండల అధ్యక్షురాలు మూలి ప్రమీల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిరుపతి, సీనియర్ నాయకులు మునగాల సూర్యనారాయణ, ఐద్వా గ్రామ నాయకురాలు ఖాసింబీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



'చలోఢిల్లీ'కి మద్దతుగా ప్రదర్శన చేస్తున్న నాయకులు

2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారని, అలాంటి ముఖ్యమంత్రి కోసం అందరం వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేద్దామని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, సచివాలయ కో ఆర్డినేటర్లు, కన్వీనర్లతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కొన్ని మీడియా ఛానెళ్ల, సోషల్ మీడియా వాళ్ళు ప్రజలను అనేక ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వాటిని తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తమ కుటుంబం కూడా పార్టీ మారుతుందని ప్రచారాలు చేశారని, తమ కుటుంబమంతా ఎప్పుడూ జగనన్నతోనే ఉంటామని తెలియజేశారు. జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో సైతం రెండవ ప్రాధాన్యత ఓటుతోనే విజయం సాధించారని, మనం ఒక్కరమే పోటి చేస్తే వాళ్లందరూ కలసి మన మీద పోటీ చేసి గెలిచారన్నారు. రానున్న కాలంలో ప్రజలందరినీ మరింత ప్రలోభాలకు గురిచేసే అవకాశముందని, కానీ మనమంతా సమిష్టిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ అధికారంలోకి వచ్చేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సమిష్టిగా కలిసి పనిచేస్తే ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

11న రెవెన్యూ సమస్యల ప్రత్యేక సమీక్ష :

ఆత్మకూరు నియోజకవర్గంలో నెలకొని ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం 11వ తేదీన రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో భూపంపిణీ, చుక్కల భూములు, సాధా బైనామా, పాసుపుస్తకాల మంజూరు, ఈనాం భూములు తదితర సమస్యలను మండలానికి ఓ గంట సమయం కేటాయిస్తూ నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్‌డిఒలతో కలసి ప్రత్యేక సమీక్ష నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, ఎఎస్‌పేట జెడ్‌పిటిసి పందులపల్లి రాజేశ్వరమ్మ, అనంతసాగరం ఎంపిపి పెయ్యల సంపూర్ణమ్మ, మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, సంగం, చేజర్ల మండల కన్వీనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

చంద్రబాబును కలిసిన ధనుష్

ప్రజాశక్తి-కలిగిరి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఇండియా ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్ బొల్లినేని ధనుష్ వారి తండ్రి మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకటరామారావుతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు వారితో మాట్లాడుతూ వాణిజ్య వివాదాలను పరిష్కరించేందుకు స్థిరమైన సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం పెట్టుబడిదారులను ఆకర్షించడానికి కీలకమని స్పష్టం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు టిడిపి పెద్దపీట వేసిందన్నారు. ఆయనవెంట బొల్లినేని కార్తీక్ తదితరులు ఉన్నారు.

టిడిపిపై విమర్శలు మానుకోవాలి

ప్రజాశక్తి-కావలి

ముస్లిం ఆస్తుల పరిరక్షణ గురించి కొంతమంది ముస్లిం నాయకులు టిడిపి నాయకులు ఆక్రమించుకున్నారని మాట్లాడడం శోచనీయమని, అక్రమాలకు సంబంధించిన వివరాలు తమవద్ద ఉన్నాయని తెలియజేయడం హాస్యాస్పదంగా ఉందని, టిడిపిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని పలువురు నాయకులు హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆదివారం ముస్లిం టిడిపి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు మాట్లాడుతూ శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం సమాజానికి సంబంధించిన ఎలాంటి హక్కులకు భంగం కలిగినా వారితో తాము కూడా కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆక్రమించింది ఎవరో.. అనే ఆధారాలతో వస్తే పార్టీతో సంబంధం లేకుండా తాము కూడా కలిసి మీతోటి మన ముస్లిం హక్కులను కాపాడుకోవడానికి పోరాటం చేస్తామన్నారు. ఆక్రమణలకు గురైన స్థలాల వివరాలతో పత్రికా ముఖంగా తెలియజేయాలని కోరారు. పార్టీలో ఎవరి అభిప్రాయాలు వారివేనని మన ముస్లిం సామాజిక అభివృద్ధే అందరి ఆశయమని, ఇది గుర్తించి ముందుకు సాగాలని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మస్తాన్, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ రఫీ అహ్మద్, పట్టణ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హఫీజ్, పార్టీ సీనియర్ కార్యకర్త, మహమ్మద్ ఇనాయత్ హుస్సేన్, షేక్ రఫీ అహ్మద్, షేక్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో సరస్వతిపూజ

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు నిర్వహించిన సరస్వతి పూజకు ఉదయగిరి సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని కె.ఆదిలక్ష్మి పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు. కంప సముద్రం హాస్టల్ సంక్షేమాధికారి అంకయ్య తమ సొంత నిధులు వెచ్చించి 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. అనంతరం మర్రిపాడు బాలుర, బాలికల వసతి గృహాలను, కంపసముద్రం బాలుర వసతి గృహాన్ని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు మహమ్మద్ అలీ, సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఇస్కపల్లి-నెల్లూరు రోడ్డు

- కల్వర్టుల వద్ద బయటపడ్డ ఐరన్

ప్రజాశక్తి-అల్లూరు


ఇస్కపల్లి వయా అల్లూరు - నెల్లూరు ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డు ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు. 20 కిలోమీటర్ల మేర కొడవలూరు-ఇస్కపల్లి మెయిన్ రోడ్డును ప్రయాణికుల సౌకర్యార్థం విస్తరించేందుకు సుమారు రూ.33 కోట్లతో 7 మీటర్ల వెడల్పునకు శ్రీకారం చుట్టారు. అట్టహాసంగా గతేడాది క్రితం నుండి రోడ్డు పనులు ప్రారంభించగా మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూ ఉండడంతో ప్రజలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడవలూరు, కొడవలూరు, అల్లూరు, బోగోలు మండల వాసులు నిత్యం రద్దీగా వేల వాహనాలలో సంచరిస్తూ ఉంటారు. కాగా ఇటీవల పద్మనాభుని సత్రం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తీవ్ర ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఆ పనులు పూర్తి కాకపోవడంతో అత్యవసర సమయంలో ప్రయాణించా లంటే వాహన చోదకులు అధిక మొత్తంలో నగదును ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పరీక్షల సమయాల్లో విద్యార్థుల బాధలు వర్ణాతీతం. అంతేకాకుండా అనేకమంది ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాలకు సకాలంలో చేరుకోకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా నిర్మించిన పలు కల్వర్టుల వద్ద ఐరన్ బయటపడడంతో కాంట్రాక్టర్ ఆర్ అండ్ బి అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతూ అధికార యంత్రాంగం ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. టపాతోపు వద్ద బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న కారణంగా కొడవలూరు రైల్వే గేటు వద్ద ప్రతి ఒక్కరికీ తీవ్ర అంతరాయం కలుగగా ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని లారీలలో తరలించే క్రమంలో వాహనాలు బారులు తీరడంతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం 108 వాహనంలో నెల్లూరు వెళ్లాలంటే 2 గంటల సమయం పడుతుందని బాధితులు తెలిపారు. అంతేకాకుండా టూ వీలర్ వాహనదారులు ఈ గోతుల్లో పడి తీవ్రంగా గాయపడుతూ బోరున విలపిస్తున్నారు.



అధ్వానంగా ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు



కల్వర్టుల వద్ద బయటపడ్డ ఐరన్



ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం కొప్పు శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యంగా ఆయా సమస్యలపై నెల్లూరు వెళ్లి రావాలంటే హడలుతున్నామని తెలిపారు. ప్రధాన రహదారి అంతా గోతులమయం కావడంతో నరకాన్ని చవిచూస్తున్నామని విచారం వ్యక్తపరిచారు. నిర్మాణ పనుల పేరట ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గతంలో డిగ్రీ విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోలేక నానా అవస్థలు పడ్డారని తెలియజేశారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎవరైనా పరీక్షలకు వెళ్లేందుకు వాహన చోదకులను సహాయం కోరితే నిరాకరించవద్దని ఆయన అన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకోకపోతే వారి భవిష్యత్తు నాశనం అవుతుందని అభిప్రాయం వ్యక్తపరిచారు.

సంబంధిత విషయంపై ఆర్ అండ్ బి డిఇ హనుమంతరావును వివరణ కోరగా బి టి అలాగే తారు, మెటీరియల్ లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదని ఏప్రిల్ నుంచి పనులు వేగవంతం చేస్తామని తెలిపారు.